చేనేత వస్త్రాలకు ఆదరణ భేష్

- ఈ నెల 9 వరకు ప్రదర్శన, విక్రయాలు
- రూ.70 లక్షలు దాటిన అమ్మకాలు

ఏయూ క్యాంపస్: చేనేత వస్త్రాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఏయూ పోలమాంబ గుడి వద్దనున్న ఏయూ మైదానంలో జిల్లా చేనేత, జౌళి శాఖ ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. ఈ నెల 9వ తేదీ వరకు ఈ విక్రయాలు కొనసాగనున్నాయి. ఇప్పటికే రూ.70 లక్షలకు పైగా విక్రయాలు జరిగినట్లు చేనేత జౌళి శాఖ అధికారులు తెలిపారు. చేనేత సహకార సంఘం, సంస్థలు, చేనేత కార్మికులకు తగిన సహకారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేనేత, జౌళి శాఖ ఈ ప్రదర్శన, విక్రయాలు చేపడుతోంది. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన చేనేత వస్త్ర తయారీదారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

విభిన్న ప్రాంతాల నుంచి..

ఈ ప్రదర్శనకు విభిన్న ప్రాంతాలకు చెందిన ఉత్పత్తిదారులు విచ్చేశారు. ధర్మవరం, వెంకటగిరి, ఫణిదం, పుత్తూరు. చీరాల, ఉప్పాడ, బొబ్బిలి, కాటన్, సిల్క్, జరీ చీరలు, మంగళగిరి డ్రస్ మెటీరియల్స్, తువ్వాళ్లు, కార్పెట్లు, పొందూరు పంచెలు, పోచంపల్లి, చందేరి వస్త్రాలను ఉత్పత్తిదారుల ధరలకే నేరుగా విక్రయిస్తున్నారు. విశాఖ వాసులు ఇప్పటికే ప్రదర్శనను తిలకించి రూ.70 లక్షల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశారు. రానున్న రెండు రోజుల విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రదర్శన నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ఎగ్జిబిషన్

ఆకట్టుకుంటున్న నమూనా మగ్గం

చేనేత వస్త్రాల తయారీ విశిష్టతను తెలియజేసే విధంగా ప్రత్యేకంగా చేనేత మగ్గాన్ని ఈ ప్రదర్శనలో ఉంచారు. దీనిపై వస్త్రాన్ని నేస్తున్న విధానం ప్రత్యక్షంగా సందర్శకులకు చూపిస్తున్నారు. ఒక్కో వస్త్రం తయారీకి ఎంత సమయం పడుతుంది, తయారీ వెనుక కార్మికులు ఎంత శ్రమ పడాలి అనే అంశాలు ఇక్కడ కళ్లకు కట్టినట్లు తెలుసుకునే అవకాశం కలుగుతోంది. చేనేత వస్త్రాల తయారీ వెనుక కార్మికుల కష్టం, వస్త్రం నాణ్యత, తయారీలో తీసుకునే జాగ్రత్తలు ప్రత్యక్షంగా అక్కడ తెలుసుకునే విధంగా ఈ నమూనా మగ్గం ఏర్పాటు చేయడంపై సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రదర్శలో ఉంచిన నమూనా చేనేత మగ్గం

క్లుప్తంగా

గాయకులు సుశీల, ఉషా ఉతప్‌లకు పురస్కారాలు నేడు



సుశీలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మద్దిలపాలెం: స్థానిక కళాభారతి ఆడిటోరియం యాక్మి ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని నిర్వాహకుడు ప్రతాప్ తెలిపారు. వేడుకల్లో భాగంగా గాయనీమణులు పి.సుశీల, ఉషాఉతప్‌కు 2023 ఔట్ స్టాండింగ్ ఇన్‌స్పిరేషన్ వుమెన్ పురస్కారాలతో సత్కరించనున్నామని పేర్కొన్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

గాయని సుశీలకు స్వాగతం

గాయని సుశీల మంగళవారం విశాఖ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆమెకు యాక్మీ ప్రతినిధి ప్రతాప్, వండర్ కిడ్స్ స్కూల్ అధినేత రాముడునాయుడు స్వాగతం పలికారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

ఏయూ క్యాంపస్: ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో జీవీఎంసీ జోనల్–3 ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతులు, వినియోగదారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని, ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవింద్, ప్రకాష్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి జి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీ కృష్ణయ్య దృష్టికి శెట్టి బలిజల సమస్యలు



ఎంపీ కృష్ణయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అప్పారి గిరిబాబు, తదితరులు

మద్దిలపాలెం: రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య దృష్టికి శెట్టి బలిజల సమస్యలు తీసుకెళ్లినట్టు వైఎస్సార్‌సీపీ 15వ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు తెలిపారు. నగరానికి వచ్చిన కృష్ణయ్యను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శెట్టి బలిజల ఆర్థిక ప్రగతికి సంబంధించి పలు అంశాలను వివరించామన్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

బీసీ సంఘం కార్యాలయం సందర్శన

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు ఎస్.మారేష్ స్థానిక కేఆర్‌ఎం కాలనీలోని విశాఖ జిల్లా బీసీ సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. వారిని సంఘం జిల్లా అధ్యక్షుడు మొల్లి అప్పారావు స్వాగతం పలికి సత్కరించారు.

సాదర స్వాగతం

బీచ్ రోడ్డు: నగర పర్యటనకు విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు విశాఖ విమానాశ్రయంలో బీసీ సంఘం నాయకులు మంగళవారం సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కుమార్ స్వామి, కార్యదర్శి వారణాసి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం లక్ష్యం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్

వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

బీచ్ రోడ్డు : రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఒక హోటల్‌లో శ్రీ వేమన సంక్షేమ సంఘం, గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. రెడ్డి సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. విశాఖ పరిపాలన రాజధాని కానున్న తరుణంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌ను గెలిపించి సీఎంకు బహుమతిగా ఇవ్వాలన్నారు. శ్రీ వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సీతంరాజు సుధాకర్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి, కాయల వెంకటరెడ్డి, వీరరాఘవ రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా సీతంరాజు గెలుపునకు కృషి

బీచ్ రోడ్డు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.వి.వామనరావు కోరారు. ఈ మేరకు మంగళవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ ఉద్యోగుల కుటుంబాల్లో ప్రతి ఓటు పోలయ్యేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ప్రచార కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కమిటీ సారథిగా వి.వి. వామనరావు, సభ్యులుగా పద్మనాభరాజు, హనుమంతరావు, చండీప్రసాద్, పైడిరాజు, సాంబశివరావులను నియమించారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

విశాఖ విద్య: విద్యా ప్రమాణాలు పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. మంగళవారం నగరంలోని సునీల్‌శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులతో కొద్ది సేపు మాట్లాడారు.

విద్యార్థుల ఇళ్ల సందర్శన

ఎండాడ, గొల్ల ఎండాడ కాలనీల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు రాత్రి డీఈవో వెళ్లి, వారు పరీక్షలకు ఎలా సిద్ధమౌతున్నది స్వయంగా పరిశీలించారు. పలు అంశాలపై ప్రశ్నించారు.

ముగిసిన రీజినల్ క్విజ్ పోటీలు

ఏయూ క్యాంపస్: ఉన్నత విద్యా మండలి నిర్వహించిన రీజినల్ క్విజ్ పోటీలు మంగళవారం ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు 31 బృందాల నుంచి 62 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు రౌండ్లలో జరిగిన పోటీలలో పాయకరావుపేట స్పేసెస్ డిగ్రీ కళాశాల, విజయనగరం ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, సీతం ఇంజినీరింగ్ కళాశాల, శ్రీకాకుళం ఐఐఐటీ విద్యార్థులు 8 మంది విజేతలుగా నిలిచారు. వీరంతా ఈ నెల 18 నుంచి విజయవాడలో ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగే సెమీఫైనల్ పోటీలకు హాజరు కానున్నారు. మూడు రీజియన్లుగా జరుగుతున్న ఈ పోటీలలో మొత్తం 12 బృందాలను ఎంపిక చేసి సెమీఫైనల్స్ నిర్వహిస్తారు. క్విజ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎ.రామ నాగహనుమాన్, ఉన్నత విద్యామండలి అధికారులు పాల్గొన్నారు.



పోటీలకు హాజరైన విద్యార్థులతో రెక్టార్ ఆచార్య సమత

జీఐఎస్ విజయవంతంతో ప్రతిపక్షాల్లో వణుకు



విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) విజయవంతంతో రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలకు వణుకు పుడుతోందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీఐఎస్ మరోసారి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సీఎం జగన్‌కు ఉన్న ఖ్యాతిని చాటిందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకం, అభిమానంతో అనేక అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు నేరుగా విశాఖ వచ్చి పారిశ్రామిక అవగాహన ఒప్పందాలు చేసుకున్నారన్నారు. ఈ సమ్మిట్‌తో ప్రపంచ పారిశ్రామిక రంగం చూపు ఏపీపై పడిందన్నారు. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించే చంద్రబాబుకు నిద్రపట్టడం లేదన్నారు.

వైభవంగా పైడిమాంబ జాతర



పైడిమాంబ దర్శనం కోసం క్యూలో భక్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, తదితరులు

ఆరిలోవ: డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన వేలా మంది భక్తులతో ఈ ప్రాంతం సందడిగా మారింది. గత నెల 27న ప్రారంభమైన వేడుకలు మంగళవారం ముగిశాయి. వేకువజాము నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్సీ సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, పలువురు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు, పలు శాఖల అధికారులు దర్శించుకున్నారు. స్థానిక నాయకులు భక్తులు మంచినీరు, పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. జాతరలో భాగంగా ప్రదర్శించిన తప్పెటగుళ్లు, పులివేషాలు ఆకట్టుకున్నాయి. సీఐ సోమశేఖరరావు, ఎస్ఐలతో పాటు సుమారు 50 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా గౌరపౌర్ణమి వేడుకలు



మహా మంగళ హారతి అందిస్తున్న వేద పండితులు

ఎంవీపీ కాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో గౌరపౌర్ణమి ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడి అవతారమైన శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జయంతిని పురస్కరించుకుని ఈ ఉత్సవం జరిపారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలకు అభిషేకం, మహా మంగళహారతి, పుష్పవృష్టి, పల్లకి సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నిష్కించన భక్తిదాస, సంస్థ ప్రతినిధులు, వేద పండితులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా



బోల్తా కొట్టిన కారు

ఎంవీపీ కాలనీ: సత్యం జంక్షన్ సమీపంలో ఓ కారు ఒక వ్యక్తిని ఢీకొని జాతీయ రహదారిపై బోల్తా కొట్టిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన బోర శ్రీను(32) మంగళవారం తెల్లవారుజామున ఎన్ఏడీ వైపు నుంచి ఆరిలోవ వైపు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నారు. సత్యం కూడలి సమీప జయభేరి షోరూం ఎదురుగా వచ్చేసరికి అతివేగం కారణంగా వై.దాలినాయుడు అనే వ్యక్తిని ఢీకొట్టడంతో పాటు చెట్టును గుద్దుకోవడంతో ఒక్కసారిగా కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. స్థానికులు స్పందించి కారులోని వ్యక్తిని బయటకు తీసి, 108కి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో గాయపడిన దాలినాయుడిని చికిత్స నిమిత్తం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం దాలినాయుడు అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

'వేదిక'పై వేడుక



పాట పాడుతున్న దివ్యాంగుడు

బీచ్‌రోడ్డు: నగరవాసుల్లో ఉన్న ప్రతిభను చాటుకునేందుకు జీవీఎంసీ ఆధ్వర్యంలో 'వేదిక' ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆర్కే బీచ్ వేదికగా తమ టాలెంట్‌ను ప్రదర్శించే అవకాశం కల్పించింది. జీ–20 సదస్సు నేపథ్యంలో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ చేపట్టింది. మూడు రోజులుగా జరిగిన వైజాగ్ టాలెంట్ హంట్‌కు విశేష స్పందన లభించింది. 400లకుపైగా ప్రదర్శనలు జరిగాయి. ముగింపు రోజైన మంగళవారం దివ్యాంగులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫ్లూట్, గిటార్ వంటి వాయిద్యాలు, పాటలు పాడుతూ ప్రతిభ చాటుకున్నారు.

ఇకపై ప్రతీ శని,ఆదివారాల్లో వేదిక

జీ–20 సదస్సు జరిగే వరకు ప్రతీ శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం ఆర్కేబీచ్ వద్ద నిర్వహించనున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసినాయుడు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను నమోదు చేసుకొని ప్రదర్శన ఇవ్వవచ్చన్నారు.

ఏయూ సమాచారం

స్త్రీశక్తి ప్రాధాన్యతను గుర్తెరగాలి



ఆచార్యులను సత్కరిస్తున్న ఆచార్య లక్ష్మీప్రసాద్

ఏయూ క్యాంపస్: స్త్రీశక్తి ప్రాధాన్యతను గుర్తెరిగి ప్రతి వ్యక్తి నడుచుకోవాలని అధికార భాషా సంఘం పూర్వ చైర్మన్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందీ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ మహిళా ఆచార్యులు రాజమాణిక్యం, జె.విజయభారతి, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ సరోజినిలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీమూర్తి ఔన్నత్యాన్ని, సహనాన్ని వివరించారు. హిందీ విభాగాధిపతి ఆచార్య ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాలలో ప్రగతి చూపాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల మృతిచెందిన మెడికో ప్రీతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

డానిడా ఫెలోషిప్‌కు అనింధ్యా రాయ్ ఎంపిక



అనింధ్యా రాయ్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్‌లో రీసెర్చ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ అనింధ్యా రాయ్ చౌదరి ప్రతిష్టాత్మకమైన డానిడా ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో చౌదరిని అభినందించారు. ఈ నెల 13 నుంచి 31 వరకు డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్ బిజినెస్ స్కూల్‌లో జరిగే మేధోసంపత్తి హక్కులు–ఆవిష్కరణ, వాణిజ్యీకరణ 'పెంపొందించడం'అంశంపై నిర్వహించే కోర్సులో అనింధ్యా పాల్గొననున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, డెన్మార్క్ ప్రభుత్వం సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో భారత్ నుంచి 15 మంది, బ్రెజిల్ నుంచి 15 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ, పరిశ్రమల సందర్శన ఉంటాయి. డాక్టర్ అనింధ్యా రాయ్ చౌదరి హార్వర్డ్ లా స్కూల్ అందించే పేటెంట్ ఎక్స్ కోర్సులో పాల్గొనడానికి యునైటెడ్ నేషన్స్ స్పెషల్ ఏజెన్సీ నుంచి స్కాలర్‌షిప్‌ను సైతం సాధించారు. ఈ సందర్భంగా అనింధ్యాని ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అభినందించారు.

'ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా విద్యార్థులు'

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విభిన్న రంగాలకు జియో ఇంజినీరింగ్ నిపుణుల అవసరం ఉందన్నారు. విభాగంలో పైథాన్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విభాగాధిపతి ఆచార్య వజీర్ మహ్మద్, విశ్రాంత ఆచార్యులు కె.నాగేశ్వరరావు, డాక్టర్ విక్టర్ బాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అదిరిన సంప్రదాయ దినోత్సవం



సంప్రదాయ వస్త్రధారణలో వీసీ ప్రసాదరెడ్డి, ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో మంగళవారం ఎథ్నిక్ డే(సంప్రదాయ దినోత్సవం) నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగ ఆచార్యులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో విభాగానికి విచ్చేశారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సైతం సంప్రదాయ వస్త్రధారణలో వచ్చి ఆకట్టుకున్నారు.విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య కుంజం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలకు శ్రద్ధ అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రెక్టార్ కె.సమత

ఏయూ క్యాంపస్: వ్యక్తిగత ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ ఫార్మసీ విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన మహిళా దినోత్సవాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను అధిగమిస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం సాగించే దిశగా నడవాలన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, ఏపీ చాంబర్స్ మహిళా విభాగం చెర్‌పర్సన్ ఎ.లీలారాణి, డాక్టర్ విద్య కందూరి, యోగా శిక్షకురాలు ఎం.లక్ష్మీ శైలజ, పోషకాహార నిపుణురాలు టి.లావణ్య, ఏయూ పాలక మండలి సభ్యురాలు ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఐపీఎస్ఈ ప్రిన్సిపాల్, లేడీ టీచర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆచార్య టి.శోభశ్రీ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో మహిళా సాధికారతకు కృషి

మహిళా సాధికారత సాకారం కావాలని ఆరిలోవలోని హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిత్య కౌరా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కలర్స్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. లింగ సమానత్వం, మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి నిబద్ధతతో పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీజీ కేంద్రంలో, సీఎంఆర్ మాల్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

బీజేపీ కార్యాలయంలో..

ఎంవీపీ కాలనీ: లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ జవ్వాది లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, సీనియర్ నాయకురాలు రత్నకుమారి, జిల్లా కార్యదర్శి చల్లా మంజుల పాల్గొన్నారు.

మహిళల రాణింపు అభినందనీయం

ఎంవీపీ కాలనీ: సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించడం అభినందనీయమని మేయర్ హరివెంకటకుమారి అన్నారు. ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో మరింత ప్రగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ కళాశాల హిందీ విభాగాధిపతి ఆచార్య పి.కె.జయలక్ష్మి పాల్గొన్నారు.